క్లుప్తంగా

వృద్ధులకు అన్న, వస్త్రదానం



అన్నదానం చేస్తున్న సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్‌: విశాఖ పోర్టు అథారిటీ ట్రాఫిక్ డిపార్టుమెంట్‌లో ట్రాఫిక్ మేనేజర్‌గా పని చేస్తున్న గోవాడ రాజేంద్ర వరప్రసాదరావు పదవీ విరమణ చేసిన సందర్భంగా గీతా మకరందం సంస్థ నేతృత్వంలో సోమవారం స్వామి వివేకానంద సంస్థలో ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులకు అన్న, వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో సీహెచ్ మసేన్, నక్కా అప్పారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్‌: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న వాసుపల్లి



సింహాద్రినాథుని సన్నిధిలో వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్‌: సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం దర్శించుకుని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అక్కడి శివాలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు.


మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనం మెనూని పరిశీలిస్తున్న ఎంఈవో

అల్లిపురం: డాబాగార్డెన్స్‌లో గల మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో–2 బి.పుష్పరాగం ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ఇతర ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతుందో లేదో పరిశీలించారు. విద్యార్థులకు ఆమె అరటి పండ్లు అందజేశారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

అంబులెన్స్ అందజేత



పాడేరు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు అంబులెన్స్ తాళాలు అందజేస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: హెచ్‌పీసీఎల్ సీఎస్ఆర్ నిధుల కింద ఇచ్చిన అంబులెన్స్‌ను కలెక్టర్ అనుమతితో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ సోమవారం పాడేరు గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రికి అందజేశారు. కేజీహెచ్‌లో జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అంబులెన్స్ తాళం చెవులను పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్రకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వామిత్ర కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగుపడని బతుకులు

పుత్తడికి ప్రత్యామ్నాయం ఇత్తడి. ఇత్తడికి మెరుగుపెడితే బంగారం దాని వద్ద దిగదిడుపే. బంగారానికి ఆసరా ఇత్తడి అని చెప్పటంలో అతిశయోక్తి కాదు. ఒకప్పుడు ప్రతి ఇంట్లోను, ప్రతి కార్యక్రమంలోను ఇత్తడి వస్తువులకు ప్రాధాన్యత ఇచ్చేవారు. రాను రాను ఇత్తడికి ప్రాధాన్యం తగ్గి, ప్లాస్టిక్‌కు ఆదరణ పెరిగింది. ఇత్తడి సామగ్రి అలంకరణకే కాకుండా అవసరం వచ్చినప్పుడు తాకట్టు పెట్టుకునేందుకు అనువుగా ఉండేది. ఆర్థిక అవసరాలు తీరేవి.

- కష్టాల సుడిలో ఇత్తడికి మెరుగు పెట్టే కార్మికులు
- ప్లాస్టిక్ రాకతో తగ్గిన వినియోగం
- వృత్తికి దూరమవుతున్న పనివారు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



ఇత్తడి సామగ్రికి మెరుగుపెడుతున్న కార్మికుడు

అల్లిపురం: కొన్నేళ్ల కిందట ఎవరింట్లో చూసినా ఇత్తడి, రాగి, తగరం వంటి లోహ పాత్రలు విరివిగా కనిపించేవి. స్టీల్ రంగ ప్రవేశం చేయటంతో ఇత్తడికి కొంచెం ఆదరణ తగ్గింది. ప్లాస్టిక్ వినియోగంలోకి వచ్చిన తర్వాత ఇత్తడి పూర్తిగా ఉనికి కోల్పోయింది. దీంతో ఇత్తడిని మెరుగు పెట్టే కార్మికులు ఉపాధి కోల్పోయారు. పల్లెల్లో కూడా వీరు పెద్దగా కనిపించడంలేదు. నగరంలో ఆ పని చేస్తున్న వారిని వేళ్లపై లెక్క పెట్టొచ్చు. ఇంకా కొంత మంది ఇత్తడి, రాగి వంటి పాత్రలకు మెరుగు పెడుతూ కొంత మేర ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం తమ బాధలను అర్థం చేసుకుని ప్రోత్సహించాలని వారు కోరుతున్నారు.

అల్లిపురంలో..

దక్షిణలోని అల్లిపురం ఇత్తడి వ్యాపారానికి ముఖ్య కేంద్రం అని చెప్పొచ్చు. ఈ ప్రాంతంలో ఇత్తడి వ్యాపారం చేసే దుకాణాలు చిన్న, పెద్ద కలుపుకుని సుమారు 30 వరకు ఉన్నాయి. నగరంతో పాటు జిల్లాలో పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి కొనుగోలుదారులు వస్తుంటారు. ఇత్తడి సామాన్ల రిపేరు, మెరుగు పెట్టే దుకాణాలు ఇక్కడ మనకు కనిపిస్తాయి. వీరికి దసరా, పెళ్లిళ్ల సమయాల్లో చేతినిండా పని ఉంటుంది. మిగతా సమయాల్లో ఖాళీగానే ఉంటారు. ఏడాదిలో నలభై రోజులు పని ఉండడం కష్టమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే తమ పిల్లలను ఈ వృత్తిలోకి తీసుకురాలేదని చెబుతున్నారు. తాము కూడా ఇంక పని చేయలేని స్థితిలో ఉన్నామని, ప్రభుత్వం తమని అరుదైన కళాకారులుగా గుర్తించి ప్రోత్సహించాలని కోరుతున్నారు. చేనేత కార్మికులకు ఇస్తున్న విధంగా నెలవారి పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకప్పుడు మన పెద్దలు రాగి, ఇత్తడి వస్తువులనే వాడేవారు. ఇప్పుడంటే అంతా ప్లాస్టిక్ మయం అయిపోయింది. అందుకే వారు ఇప్పటికీ అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యంగా ఉన్నారు. అందువల్ల మనం కూడా రాగి, ఇత్తడి పాత్రలను వాడితే ఆరోగ్యంగా ఉండవచ్చు. రాగి పాత్రలో 3 గంటల పాటు నీటిని నిల్వ ఉంచితే క్రిములు నశిస్తాయి. దీంతో ఆ నీరు పరిశుభ్రంగా మారుతుంది. రాగి పాత్రల్లో నీటిని నిల్వ ఉంచడం వల్ల ప్రమాదకరమైన ఈకొలి బ్యాక్టీరియా కూడా అంతమవుతుంది. దీని వల్ల అనారోగ్యం దరి చేరదు. ఇత్తడి పాత్రలను జింక్, అల్లాయ్ మిశ్రమంతో తయారు చేస్తారు. జింక్ వల్ల మన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అందుకని ఇత్తడి పాత్రల్లో అయినా నీటిని తాగవచ్చు. లేదా ఆ పాత్రల్లో వంట చేసుకుని తినొచ్చు. రాగి పాత్రలో నిల్వ ఉంచిన నీటిని తాగడం వల్ల అసిడిటీ, అజీర్ణం, డయేరియా, కామెర్లు, కీళ్లనొప్పులు తగ్గుతాయి. అధిక బరువు తగ్గుతారు. గుండె సమస్యలు రావు. క్యాన్సర్ కణాలు నశిస్తాయి, థైరాయిడ్ గ్రంథి పనితీరు మెరుగవుతుంది. రక్తహీనత ఉండదు. హైబీపీ తగ్గుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఆదరణ తగ్గింది..



ఇత్తడి సామగ్రికి ఆదరణ తగ్గింది. ఎవరూ అంతగా వినియోగించడం లేదు. అలవాటైన పని కావడంతో ఈ పనే చేసుకుంటున్నాం. పని లేక ఇబ్బందులు పడుతున్నాం. రోజంతా కష్టపడినా అన్ని ఖర్చులు పోను రోజుకు రూ.200 మిగలటం కష్టం. కానీ తప్పటం లేదు. ప్రభుత్వం ఈ వృత్తిని అరుదైన వృత్తిగా గుర్తించి, చేనేత కార్మికుల వలే నెలవారి పింఛను ఏర్పాటు చేస్తే మాకు చేయూతగా ఉంటుంది.

– బి. శ్రీను, ఇత్తడి మెరుగు కార్మికుడు

పని లేక ఇబ్బంది పడుతున్నాం..



పని లేక ఇబ్బంది పడుతున్నాం. నేను నా తండ్రి నుండి ఈ వృత్తి నేర్చుకున్నాను. నా పిల్లలు ఈ వృత్తి నేర్చుకోవడానికి సిద్ధంగా లేరు. వారు వేరే పనులు చేసుకుంటున్నారు. ఏడాదిలో మూడు నెలలు పని ఉండటం కష్టం. కానీ మాకు మరో పని చేత కాక ఈ వృత్తినే నమ్ముకున్నాం. ప్రభుత్వం చేతివృత్తుల వారిగా గుర్తించి ప్రోత్సాహం అందిస్తే మాకు చేయూత ఇచ్చినట్లు అవుతుంది.

–కోనూరి రవి, ఇత్తడి మెరుగు కార్మికుడు, అల్లిపురం

ఇప్పటి పెళ్లిళ్లలో ఇత్తడి ఊసే లేదు..



మా కాలంలో సారెగా ఎంత ఇత్తడి సామగ్రి తీసుకొచ్చారో చూసేవారు. ఇత్తడిని ఐశ్వర్యానికి గుర్తుగా భావించేవారు. ఇప్పటి పెళ్లిళ్లలో ఒక్క ఇత్తడి చెంబు కనిపించడం లేదు. వాటి నిర్వహణ నేటి తరం వారికి భారంగా మారింది. ఇంటికి వచ్చిన అతిథులకు కాళ్లు కడుక్కునేందుకు ఇత్తడి చెంబులో నీళ్లు అందించి, సత్తు గిన్నెలో అన్నం పెట్టకపోతే అవమానంగా భావించేవారు. కాలం మారి కొద్దీ స్టీలు, ప్లాస్టిక్ ఆ స్థానాన్ని ఆక్రమించాయి. – మద్దాల సుబ్బులక్ష్మి, గృహిణి

ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్–5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు ఆదేశించారు. జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు ఎక్కువగా ఉందంటూ టౌన్ ప్లానింగ్ విభాగానికి 03, పారిశుధ్య సమస్యపై పబ్లిక్ హెల్త్ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈలు తారా, ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు మద్యం బాటిళ్లు కలిగిన వ్యక్తి

అల్లిపురం: ఈ నెల 27వ తేదీన సిటీ టాస్క్ ఫోర్స్ పోలీసులు 31వ వార్డు జనసేన బూత్ కమిటీ సభ్యుడు శీరం రాజును 21 మద్యం సీసాలతో అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు నిందితుడిని మద్యం బాటిళ్లతో సహా టూటౌన్ పోలీసులకు అప్పగించారు. దీంతో టూటౌన్ సీఐ బి.తిరుమలరావు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



ప్రజా మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశాలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్



ఫ్రూట్‌మార్కెట్ వద్ద చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

జగదాంబ: వీధుల్లో వ్యాపారులు ఆక్రమణలు వెంటనే తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ జోన్–4 పరిధి 35వ వార్డులో అధికారులతో కలిసి పర్యటించారు. దుర్గాలమ్మ గుడి నుంచి ఆయిల్‌మిల్లు సందురోడ్డు, ప్రసాద్‌గార్డెన్స్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం రోడ్డు, రామకృష్ణా థియేటర్ జంక్షన్, జనతాకాలనీ, గాజులవీధి, పోలీసు బ్యారెక్స్, కల్లుపాకలు ప్రాంతాల్లో పర్యటించి కాలువలు, రహదారులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాపారులు వీధులు, రోడ్లను ఆక్రమించుకోవడంతో కాలువల్లో చెత్త పేరుకుపోతుందన్నారు. స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. హోల్‌సేల్ ఫ్రూట్‌మార్కెట్, వెదురు, స్క్రాప్ దుకాణాల ప్రాంతాల్లో అధికంగా ఉన్న వ్యర్థాలను గమనించిన ఆయన వెంటనే వాటిని తొలగించి పరిశుభ్రం చేయాలన్నారు. జనతాబజార్ వద్ద వ్యాపారులు రహదారిని ఆక్రమించుకోవడం గమనించిన ఆయన స్లాబ్‌ను వెంటనే తొలగించాలన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులకు అపరాధ రుసుము విధించాలని జోనల్ కమిషనర్‌కు ఆదేశించారు. ప్రసాద్‌గార్డెన్స్‌లో ఉన్న ప్రజా మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని కేర్‌టేకర్‌కి ఆదేశించారు. జనతాబజార్ వద్ద నిర్మిస్తున్న అన్న క్యాంటీన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరింగ్ అధికారి సత్యనారాయణరాజుకు ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.దామోదర్, ఈఈ సంతోషకుమారి, ఏఎంహెచ్‌వో రాజేష్, ఏసీపీ ఝాన్సీలక్ష్మి, డీఈఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

అల్లిపురం: ఈ నెల 28వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'భూగర్భ డ్రైనేజీ కలేనా?' శీర్షికన ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ యూజీడీ విభాగం సహాయ ఇంజినీరు స్పందించారు. అల్లిపురంలోని వెంకటేశ్వరమెట్ట, నారాయణవీధి, సాయిబాబావీధి, మిరపకాయల వీధి ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని సోమవారం ఒక లేఖలో వివరించారు. బంగారుమెట్ట ప్రాంతంలో కొంత వరకు పనులు పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన చోట్ల భూగర్భంలో కొండరాళ్లు ఉన్నందున పైపు లైన్ల లెవెల్ల సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారుల నుండి పరిపాలన ఆమోదం పొందిన తర్వాత టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

క్రైస్తవ నాయకుల సమావేశం




సమావేశమైన క్రైస్తవ నాయకులు

దాబాగార్డెన్స్‌: విశాఖ జిల్లా క్రైస్తవ నాయకుల సమావేశం సోమవారం నగరంలోని ఓ హోటల్లో జరిగింది. రాబోయే రోజుల్లో దేవుని రాజ్య విస్తరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే సమావేశాలు, సేవకుల సదస్సు, ఐక్య కార్యాచరణ కోసం సీనియర్ దైవ సేవకుడు డాక్టర్ గరికిముక్కల పాల్ విక్టర్ పిలుపు మేరకు ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నశించిపోయే ఆత్మలను ముందుకు తీసుకెళ్లాలనే ఆశయంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దైవజనులందరితో ఆగస్టు 6న పెందుర్తిలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్లు డాక్టర్ నల్ల శామ్యూల్, డాక్టర్ ఎస్. డేవిడ్‌రాజ్, బిషప్ జార్జిబాబు, ఎం. అబ్రహం, బిషప్ జాన్ విక్టరి, డాక్టర్ భాస్కరరాజు, కె. పద్మకుమార్, వై. పాల్ ఐజక్, డాక్టర్ అనల్ చోప్రా, అభిషేక్‌రాజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

దాబాగార్డెన్స్‌: ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఆగస్టు 3 నుంచి 6 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నగరంలో గల కేరళ ఆయుర్వేద కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 4 రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునే వారు అపాయింట్‌మెంట్ కోసం 7675861446, 0891–2568264 నంబర్లలో సంప్రదించాలన్నారు. మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపాన గల తమ కేంద్రంలో నేరుగా వచ్చి కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే వంశీ



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీ

దాబాగార్డెన్స్‌: దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్ఎం కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: రైల్వేలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం ముందు ఈస్ట్ కోస్ట్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్–సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ రైల్వేలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సెలవులు అమలుచేయాలని కోరారు. కాంట్రాక్టర్ మారితే ఉద్యోగులను తొలగించడం వంటివి చేస్తున్నారని, మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. 45 ఏళ్ల వయో పరిమితిని 60 ఏళ్ల వరకు పొడిగించాలని వీరు కోరారు. కార్యక్రమంలో ఎం.రాంబాబు, ఒ.అప్పారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, యు.వి.రాజు, వెంకటరావు, మౌళి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోగా ఈశ్వరరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈశ్వరరావు

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయ ఏవోగా కె.వి.ఈశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లిన ఆయన ఇటీవల తిరిగి వచ్చారు. గతంలో ఏవోగా పని చేసిన ఆయనను ఇప్పుడూ అదే పదవిలో నియమించారు. ఈశ్వరరావు గతంలో భీమిలి, సీతమ్మధార తదితర ప్రాంతాల్లో తహసీల్దార్‌గా పని చేశారు.

అండర్–16 విజేత విశాఖ

విశాఖ స్పోర్ట్స్‌: అండర్ 16 మల్టీడే అంతర జిల్లాల మ్యాచ్‌ల ఫైనల్‌లో విశాఖ జట్టు 438 పరుగుల తేడాతో విజయం సాధించింది. నెల్లూరు వేదికగా మూడు రోజుల పాటు జరిగిన తుది పోరులో కృష్ణా జట్టుపై టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు ఏడు వికెట్లకు 456 పరుగుల చేసింది. శ్రావన్ 113, రోహన్ 151 పరుగులతో సెంచరీలు నమోదు చేయగా ఈశ్వర్ 87 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్ సాయి సాత్విక్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా కృష్ణా జట్టు 148 పరుగులకే ఆలౌటైంది. భానుస్వరూప్ ఆరు వికెట్లు తీయగా గౌతమ్ రెండు వికెట్లు తీశాడు.

పీఎం సూర్య ఘర్ యోజన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన కరపత్రం, పోస్టర్‌ను కలెక్టర్ హరిందిర ప్రసాద్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్ టి.సీతారామ మూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ ఎల్.మహేంద్రనాథ్, జీవీఎంసీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నిర్మూలన



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్‌: వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తన బంగ్లా నుంచి బ్యాటరీ వాహనంలో జీవీఎంసీకి వచ్చారు. అనంతరం వారిద్దరు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు.

బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వల జాబితా ప్రదర్శించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: రక్త నిల్వల జాబితా, వివరాలు ప్రతి బ్లడ్ బ్యాంకులో ప్రదర్శించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లాస్థాయిలో ఉన్న బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులతో సోమవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో కనీసం రెండు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని, అవసరమైన సమాచారాన్ని జిల్లా అధికారులకు ఇవ్వాలన్నారు. హెపటైటిస్–బి, సి పాజిటివ్ కేసులు, హెచ్ఐవీ, సిఫిలిస్ కేసుల వివరాలను వైద్య ఆరోగ్య శాఖకు పంపించాలని తెలిపారు. ముఖ్యంగా తలసేమియా కేసులకు ఉచితంగా రక్తం సరఫరా చేయాలని ఆదేశించారు. బ్లడ్ బ్యాంక్‌ల నిర్వహణకు లైసెన్స్, శిబిరాల నిర్వహణకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల కాలం కనుక తగిన స్థాయిలో ప్లేట్‌లెట్లను ప్రతి బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉంచుకోవాలన్నారు. ఏ ఒక్కరికి బ్లడ్ లేదంటూ నిరాకరించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, సహాయ అధికారి ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్లు బద్రి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా సమస్య పరిష్కారం కాలేదు

మేయర్, కమిషనర్ ముందు బైఠాయించిన మహిళ



కమిషనర్‌కు సమస్య వివరిస్తున్న బాధిత మహిళ

దాబాగార్డెన్స్‌: మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జయలక్ష్మి అనే మహిళ తన ఆవేదనను కమిషనర్‌కు చెప్పుకునేందుకు వచ్చారు. బీఆర్‌టీఎస్ పుణ్యమా అంటూ తమ భూమి తీసుకున్నారని, టీడీఆర్‌లు ఇస్తామన్నారని తెలిపారు. రోడ్డు విస్తరణలో ఎన్ఏడీ వద్ద ఏడుగురి ఇళ్లు జీవీఎంసీ తీసుకుందని, ఐదుగురికి డబుల్ టీడీఆర్‌లు అప్పటి ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదుగా అందజేశారన్నారు. భూమి తన భర్త పి.వెంకట నారాయణ (అడ్వకేట్) పేరుపై ఉందని పేర్కొన్నారు. పలుమార్లు ఎమ్మెల్యే గణబాబు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జీవీఎంసీ చుట్టూ గత పదేళ్లుగా తిరుగుతున్నా ఎవరూ స్పందించడం లేదన్నారు. గత కమిషనర్ రాజాబాబు (సాయికాంత్ వర్మకు ముందు) స్పందించారు. మూడు రోజుల్లోనే సింగిల్ టీడీఆర్ ఇప్పించారు. భూమి కోల్పోయిన ఏడుగురిలో ఐదుగురికి డబుల్ టీడీఆర్‌లు ఇచ్చారని, తనకు సింగిల్ టీడీఆర్ ఇవ్వడమేంటని ప్రశ్నించానన్నారు. దీంతో సీసీపీని కలవాలని కమిషనర్ ఆదేశించారన్నారు. అయితే తన సమస్య మాత్రం పరిష్కారం కాలేదని తెలిపారు. దీనికి కమిషనర్ సంపత్‌కుమార్ బదులిస్తూ ఫైల్ చూసి పరిష్కరిస్తానని చెప్పారు. దీంతో ఆమె ఆగ్రహావేశాలకు గురై ప్రతి సోమవారం వచ్చి ఫిర్యాదు ఇచ్చి వెళ్లిపోవడం తప్ప ఇక్కడ ఏ అధికారికి బాధ్యత లేదా? అంటూ మేయర్, కమిషనర్ ముందు బైఠాయించారు. కమిషనర్ స్పందిస్తూ మధ్యాహ్నం 3 గంటలకల్లా ఆమె సమస్య పరిష్కరిస్తామన్నారు. మూడు గంటలకు సీసీపీ కార్యాలయానికి వెళ్లాలని బాధిత మహిళకు చెప్పారు. ఆమె వెళ్తే టీడీఆర్ సిద్ధం చేశామని, కమిషనర్‌కు కాపీ అందజేసిన తర్వాత అందజేస్తామని చెప్పినట్లు బాధిత మహిళ జయలక్ష్మి పేర్కొన్నారు.